క్లుప్తంగా

స్వచ్ఛందంగా ఆక్రమణల తొలగింపు



రైల్వే స్థలంలో స్వచ్ఛందంగా ఆక్రమణలను తొలగిస్తున్న పట్టణ వాసులు

పుత్తూరు: పట్టణంలోని రైల్వే శాఖకు చెందిన స్థలాలను ఆక్రమించుకున్నవారు సోమవారం స్వచ్ఛందంగా తొలగింపు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. గేటుపుత్తూరులోని సర్వే నంబర్ 200/3లో తిరుపతి–చెన్నై రైల్వే ట్రాక్‌కు ఇరువైపులా ఆక్రమణలు తొలగించాలని గతేడాది నవంబర్‌లోనే రైల్వే అధికారులు ఆక్రమణదారులకు నోటీసులు ఇచ్చారు. స్పీడ్ ట్రైన్స్ రాకపోకల సందర్భంగా ప్రమాదాల నివారణకు రైల్వే ట్రాక్‌లకు ఇరువైపులా రక్షణ గోడల నిర్మాణం నిమిత్తం ఆక్రమణలు తొలగించాలని అందులో పేర్కొన్నారు. దీనిపై స్పందించిన మంత్రి ఆర్కే రోజా రైల్వే శాఖ ఉన్నతాధికారులతో చర్చించి ఇప్పటి వరకు ఆక్రమణల తొలగింపును ఆపుదల చేశారు. అయితే రైల్వే అధికారులు గత మూడు రోజుల క్రితం మళ్లీ ఆక్రమణదారులకు ఖాళీ చేయాల్సిందిగా నోటీసులు జారీ చేశారు. దీంతో పాత కేబిన్ నుంచి స్వచ్ఛంద తొలగింపు కార్యక్రమం ప్రారంభమైంది.

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయండి



మాట్లాడుతున్న ఎంపీపీ అనిత

గంగాధర నెల్లూరు: మండలంలో చేపడుతున్న అభివృద్ధి పనులపై అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ అనిత తెలిపారు. సోమవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అనిత అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ అనిత మాట్లాడుతూ మండలంలో ఎన్నడూ లేనివిధంగా అభివృద్ధి పనులకు ప్రభుత్వం భారీగా నిధులు మంజూరు చేస్తోందన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా మండలంలోని ప్రతి గ్రామ పంచాయతీకి రూ.20 లక్షలు మంజూరైందని, వాటితో గ్రామాల్లో రోడ్లు, మంచి నీటి సదుపాయం తదితర పనులు జరుగుతున్నాయని అన్నారు. వీటిని త్వరగా పూర్తి చేసేలా అధికారులు చొరవ చూపాలని కోరారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, గ్రామీణ ప్రాంతాల్లో వ్యాధులు సోకకుండా వైద్యాధికారులు, సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు హరిబాబు, బేబి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ సుధాకర్, ఏపీఎం చిరంజీవి, ఎలక్ట్రికల్ ఏఈ రాజా, ఉపాధిహామీ ఏపీఎం శ్రీనివాసులు, ఎంఈఓ గుణశేఖర్ రెడ్డి, ఇన్‌చార్జ్ హౌసింగ్ ఏఈ దాము, ఏఓ వందన, సర్పంచులు, ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ సుధాకర్‌కు సన్మానం

గంగాధర నెల్లూరు మండల ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించిన సుధాకర్‌ను ఎంపీపీ అనిత, వైస్ ఎంపీపీలు హరిబాబు, బేబి ఘనంగా సన్మానించారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన మండల మీట్‌లో ఆయనకు ప్రజాప్రతినిధులు, కార్యాలయ సిబ్బంది సైతం శుభాకాంక్షలు తెలియజేశారు.

వేలావడి ఎస్టీ కాలనీలో వసతులు



మంత్రి రోజాకు కృతజ్ఞతలు తెలుపుతున్న వేలావడి ఎస్టీ కాలనీవాసులు

నగరి: మండల పరిధిలోని వేలావడి ఎస్టీ కాలనీలో అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పర్యటించి అవసరమైన మౌలిక వసతులను ఏర్పాటు చేశారు. ఇటీవల మంత్రి ఆర్కే రోజా వేలావడి ఎస్టీ కాల నీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ సమయంలో గ్రామస్తులు విద్యుత్ లైట్లు, శ్మశాన స్థల ఏర్పాటు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన మంత్రి వాటిని పరిష్కరించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. దీంతో సోమవారం వేలావడి ఎస్టీ కాలనీలో ఆర్బీకే చైర్మన్ బుజ్జిరెడ్డి, వైస్ ఎంపీపీ ఢిల్లీబాబు, మండల కన్వీనర్ హరి, గ్రామ సర్పంచ్ చంద్రకళ, ఎంపీటీసీ జ్యోతి, మాజీ సర్పంచులు వేలాయుధం, చాంద్‌బాషా, రామకృష్ణ, చెంగయ్య తో పాటు అధికారుల బృందం పర్యటించి అవసరమైన ఏర్పాట్లు చేశారు. ఎం.కొత్తూరు ఏఏడబ్ల్యూ నుంచి వేలావడి ఎస్టీ కాలనీ వరకు విద్యుత్ లైట్ల ఏర్పాటుకు గానూ 12 స్తంభాలను అందజేశారు. అలాగే శ్మశానానికి అవసరమైన స్థలాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ తమ సమస్యలను పరిష్కరించిన మంత్రి రోజాకు కృతజ్ఞతలు తెలిపారు.

కార్తీక పౌర్ణమితో ఆధ్యాత్మిక శోభ

- కిటకిటలాడిన ఆలయాలు
- దీపాల వెలుగుల్లో పౌర్ణమి పూజలు

కార్వేటినగరం: కార్తీక పౌర్ణమి, కార్తీక సోమవారం కలసి రావడంతో శైవ క్షేత్రాల్లో శివనామస్మరణ మార్మోగింది. కార్తీ పౌర్ణమి వేళ అంతటా ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి శివుడికి పూజలు చేశారు. కార్వేటినగరంలో ప్రసిద్ధి చెందిన స్కంధ పుష్కరిణి సమీపంలో వెలసిన శ్రీతంగమేశ్వరస్వామి ఆలయంలో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి దర్శించుకున్నారు. మహిళలు పిండిదీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు స్వామివారికి అర్చనలు, అభిషేకాలు నిర్వహించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అదేవిధంగా కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో, శిష్టా సౌందర్యవల్లి సదాశివేశ్వరస్వామి ఆలయంలో, ఉమామహేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు భారీగా విచ్చేసి కార్తీక దీపోత్సవాలను వెలిగించడంతో శైవక్షేత్రాలు భక్తిభావంతో పరిఢవిల్లాయి. అదేవిధంగా స్కంధ పుష్కరిణి సమీపంలోని కుమారగిరిపై వెలసిన వళ్లీ దేవసేన సమేత శ్రీసుబ్రమణ్యస్వామికి కార్తీక పౌర్ణమి సందర్భంగా భక్తులు కావళ్లు చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు.

పెనుమూరులో..

పెనుమూరు(కార్వేటినగరం): మండల పరిధిలో కొటార్లపల్లి గ్రామ సమీపంలోని కాశేరుగుట్టపై వెలసిన ఈశ్వరస్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొలిపి అర్చనలు, అభిషేకాలు చేపట్టారు. అనంతరం స్వామివారిని పట్టువస్త్ర, సుగంధభరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్న ప్రసాదాలను పంచిపెట్టారు. కాశేరు గుట్టపై ఓంకార రూపంలో వెలసిన స్వామివారి స్థల పురాణాన్ని భక్తులకు వివరించి ఆలయ ప్రత్యేకతను చాటి చెప్పారు. సంతానం లేనివారు స్వామివారిని దర్శించుకున్నట్లయితే వారికి సంతాన ప్రాప్తి కలుగుతుందన్నారు.





ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శన మిస్తున్న తంగమేశ్వర స్వామివారు, కార్వేటినగరంలో...

శ్రీరంగరాజపురంలో..

శ్రీరంగరాజపురం: మండలంలోని పల్లేరుకాయలకోనలో వెలసిన ఆత్మలింగేశ్వర స్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం ఆత్మలింగేశ్వర స్వామికి పాలాభిషేకం చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు ఆధ్వర్యంలో స్వామివారిని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం తీర్థప్రసాదాలు పంచి పెట్టారు. అలాగే ఆలయ ఆవరణలో ఉన్న పంచముఖ అంజనేయ స్వామికి పూజలు చేశారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు మోహన్‌నాయుడు, ఎంపీపీ సరిత, జెడ్పీటీసీ రమణప్రసాద్‌రెడ్డి, సర్పంచ్ హరిత పాల్గొన్నారు.

గంగాధర నెల్లూరులో..

గంగాధర నెల్లూరు: కార్తీక పౌర్ణమి సందర్భంగా మండల కేంద్రంలోని గంగాధరేశ్వరస్వామి ఆలయం శివనామస్మరణలతో మార్మోగింది. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు గంగాధరేశ్వరుడికి మహారుద్రాభిషేకాలు, ప్రత్యేక బిల్వార్చన, ఆకాశ దీపం, లక్ష్య దీపార్చన నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయ ప్రాంగణం మహిళలు వెలిగించిన కార్తీక దీపాలతో శోభాయమానంగా కనిపించింది. అనంతరం భక్తులకు ప్రసాదాలు వితరణ చేశారు.



ప్రత్యేక అలంకరణలో కొండమల్లేశ్వర స్వామివారు

కొండమల్లేశ్వరస్వామి ఆలయంలో..

వెదురుకుప్పం: మండల పరిధిలోని డీఆర్ఎన్ కండ్రిగ సమీపంలో అరుణగిరి కొండపై వెలసిన శ్రీ కొండమల్లేశ్వరస్వామి ఆలయంలో సోమవారం కార్తీక దీపోత్సవాలను భక్తులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణను నేతి దీపాలతో సుందరంగా అలంకరించారు. ఉదయం నుంచి ఆలయ ఆవరణలో శివ నామ సంకీర్తనలతో మార్మోగింది. రాత్రి అఖండ జ్యోతిని వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేపట్టారు. మండలంలోని పచ్చికాపల్లం గ్రామానికి చెందిన దాము జ్ఞాపకార్థం ఆయన కుమారులు మురళి, తులసి ఆలయ భజన బృందానికి తబలా వితరణ చేశారు.



పాలసముద్రం: ప్రత్యేక అలంకరణలో స్వామివారు

పాలసముద్రంలో..

పాలసముద్రం: మండలంలోని రాచపాల్యం గ్రామంలో వెలసిన బాలగురునాథీశ్వరస్వామి ఆలయంలో శివనామ స్మరణ మార్మోగింది. సోమవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆలయంలో స్వామివారికి పాలాభిషేకం చేపట్టారు. సాయంత్రం ప్రతి ఇంటి నుంచి మహిళల పిండి దీపాలను ఊరేగింపుగా తీసుకొచ్చి ఆలయ ఆవరణలో వెలిగించారు. వేదపండితులు స్వామివారిని భక్తులు తీసుకొచ్చిన వివిధ పుష్పాలతో సుందరంగా అలంకరించారు. స్వామివారిని దర్శించుకునేందుకు స్థానిక భక్తులతో పాటు తమిళనాడు, కర్ణాటక నుంచి భారీగా రావడంతో ఆలయం కిటకిటలాడింది.





శ్రీరంగరాజపురం: అన్నదానం చేస్తున్న ఆలయ నిర్వాహకులు, శివనామ సంకీర్తనలు ఆలపిస్తున్న భజన బృందం

పేదలను నిండా ముంచిన చంద్రబాబు

- రూపాయి వేసి ఇళ్లు కట్టుకోండని చెప్పి ప్రజలను అప్పలు పాలు చేశారు
- పెండింగ్ బిల్లులను చెల్లించిన సీఎం జగనన్నకు రుణపడి ఉండాలి
- జీడీ నెల్లూరుకు రూ.1.30 కోట్లు నిధులు మంజూరు
- డిప్యూటీ సీఎం నారాయణ స్వామి



శ్రీరంగరాజపురం: చంద్రబాబు పేదలను నిండా ముంచారని, ఆయన చేసిన పాపాలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కడుగుతున్నారని డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. సోమవారం ఆయన జీడీ నెల్లూరులో మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు మానవత్వం లేని మనిషి అని, పేదలను నిలువునా మోసం చేశారని ఆరోపించారు. ఒక రూపాయి చెల్లించి ఇళ్లు కట్టుకోండి తమ ప్రభుత్వమే పూర్తి ఇంటి ఖర్చు చెల్లిస్తుందని చెప్పి గత 2019 ఎన్నికల సమయంలో ప్రజలను మభ్యపెట్టి మోసం చేశారని దుయ్యపెట్టారు. పేదలు ఆయన మాటలు నమ్మి అప్పులు చేసి ఇల్లు కట్టుకుని ప్రభుత్వ సాయం కోసం ఎదురు చూస్తుండగా, బాబు పట్టించుకోలేదన్నారు. సీఎం జగనన్న ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించి తక్షణం సమస్యలను పరిష్కరించి ప్రజల మన్ననలు పొందుతున్నారని తెలిపారు. ఈ విషయాన్ని తాను జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో తెలుపగా మానవతా దృక్పథంతో సీఎం జగనన్న పేదల బడుగు బలహీన వర్గాలకు రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ.17కోట్లు మంజూరు చేశారని, ఆయనకు ప్రజలు రుణపడి ఉంటారన్నారు. తమ నియోజక వర్గం జీడీ నెల్లూరులో సుమారు 218 మందికి రూ.1.30 కోట్లు మంజూరు చేశారని ఇప్పటికే కొంతమంది లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమచేయడం జరిగిందన్నారు. రెండు రోజుల్లో అందరికీ అందుతుందన్నారు. ఇందులో 66 మంది ఎస్సీలు, 12 మంది ఎస్టీలు, 59 మంది బీసీలు, 79 మంది ఓసీలు, ఇద్దరు మైనారిటీలు లబ్ధి పొందనున్నట్లు ఆయన తెలిపారు. 2019 సార్వత్రిక ఎన్నికల సమయంలో చంద్రబాబు పసుపు–కుంకుమ పథకం పేరిట మహిళలను మోసం చేశారని గుర్తుచేశారు. వచ్చే ఎన్నికలలో ప్రజలు చంద్రబాబును నమ్మే పరిస్థితి లేదని ఆయన తేల్చి చెప్పారు.

మహా ధర్నాలో ఏఐటీయూసీ నాయకులు



విజయవాడలో నగరి ఏఐటీయూసీ నాయకులు

నగరి: కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ సోమవారం విజయవాడ జింఖానా గ్రౌండ్‌లో జరిగిన మహా ధర్నాలో చిత్తూరు జిల్లా ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కోదండయ్య నాయకత్వంలో నగరి నాయకులు పాల్గొన్నారు. మహా ధర్నాలో కేంద్ర కార్మిక సంఘాల నాయకులు, రైతు ఖాన్ సంఘాల నాయకులు ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ పరం చేస్తున్న బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. రైతన్నలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, ఉచిత విద్యుత్ స్థానంలో విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేయవద్దని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చందామర్రై, హేమలత, నాయకులు వినాయకం, జయశంకర్, ధనలక్ష్మి, జ్యోతి, ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ అందజేత



కడపగుంటలో బాధితులకు రూ.8 లక్షల చెక్కును అందజేస్తున్న నాయకులు, అధికారులు



బట్టుకండ్రిగలో యశ్విని కుటుంబ సభ్యులకు రూ.3 లక్షల చెక్కును అందజేస్తున్న నాయకులు

గంగాధరనెల్లూరు: జీడీ నెల్లూరు మండలంలో గత అక్టోబర్‌లో జరిగిన పలు రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందిన బాధితుల కుటుంబ సభ్యులకు డెప్యూటీ సీఎం నారాయణస్వామి చొరవతో మంజూరైన రూ.11 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అధికారులతో కలిసి వైఎస్సార్‌సీపీ మండల నాయకులు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ సీడీసీఎంఎస్ చైర్మన్ వేల్కూరు బాబు రెడ్డి మాట్లాడుతూ మండలంలోని కడపగుంటకు చెందిన శేఖర్, ఉష దంపతులు ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా డిప్యూటీ సీఎం నారాయణ స్వామి చొరవ తీసుకుని సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మరణించిన వారి కుటుంబసభ్యులకు భరోసా కల్పిస్తూ ప్రమాదం జరిగిన ఒక్క నెలలోనే రూ.8 లక్షలు మంజూరు చేయించారన్నారు. అదేవిధంగా మండల కన్వీనర్ పూర్ణచంద్రారెడ్డి మాట్లాడుతూ మండలంలోని పెద్దకాల్వ పంచాయతీ బట్టుకండ్రిగకు చెందిన వెంకటేష్ రెడ్డి కుమార్తె యశ్విని కలికిరికొండలో ట్రాక్టర్ బోల్తా పడి మృతి చెందగా, బాలిక కుటుంబ సభ్యులకు భరోసా కల్పిస్తూ డిప్యూటీ సీఎం నారాయణ స్వామి చొరవతో రూ.3 లక్షలు మంజూరు చేశారని తెలిపారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబసభ్యులు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్ రెడ్డికి, డిప్యూటీ సీఎం నారాయణ స్వామికి జీవితాంతం రుణపడి ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర గ్రీనింగ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ గుణశేఖర్ రెడ్డి, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు వెంకట రెడ్డి, వైస్ ఎంపీపీ హరిబాబు, తహసీల్దార్ ఇన్బనాథన్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చిన్నమ రెడ్డి, కడపగుంట సర్పంచ్ బుజ్జిమణి, ఎంపీటీసీ ఉమామహేశ్వరి, పెద్దకాల్వ సర్పంచ్ ఏకాంబరం, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వేలు మొదలియార్, ఆర్బీకే చైర్మన్ బలరాంబాబురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా వికసిత్ సంకల్పయాత్ర



వికసిత్ సంకల్ప వీడియోలను ప్రదర్శిస్తున్న ఎంపీడీఓ మోహన్‌మురళి

కార్వేటినగరం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను గుర్తు చేయడానికే వికసిత్ సంకల్పయాత్ర చేపడుతున్నట్లు ఎంపీడీఓ మోహన్‌మురళి అన్నారు. జిల్లా కలెక్టర్ షణ్మోహన్ ఆదేశాల మేరకు సోమవారం మండల పరిధిలోని గోపిశెట్టిపల్లి, లక్ష్మీరాజపేట పంచాయతీలలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న వికసిత్ సంకల్పయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు కళ్లకు కట్టినట్లు చూపించడానికి సంకల్పయాత్ర దోహదపడుతుందని తెలిపారు. ఈ యాత్ర మండలంలో ప్రతి రెండు పంచాయతీల్లో నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ఈ యాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సంకల్ప యాత్ర రథంలో వికసిత్ సంకల్పయాత్రకు సంబంధించిన వీడియోలను విడుదల చేశారు. అదే విధంగా భరతమాత వేషధారణలో ఓ విద్యార్థిని ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ లక్ష్మీపతి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైభవంగా పున్నమి గరుడ సేవ



చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలో వెలసిన శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారు సోమవారం రాత్రి గరుడవాహనంపై భక్తులను అనుగ్రహించారు. కార్తీక మాసం పౌర్ణమి సందర్భంగా తెల్లవారుజామున స్వామివారిని సుప్రభాత సేవలో మేల్కొలిపి నిత్య కైంకర్యాలను నిర్వహించారు. సాయంత్రం ఆలయ ఆవరణలో విద్యుత్ కాంతుల నడుమ స్వామివారి ఊంజల్ సేవ కనుల పండువగా జరిగింది. అనంతరం గోవిందుడు గరుడునిపై ఆశీనులై నాలుగు మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు.

'ఆడుదాం ఆంధ్ర'ను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ విద్యావతి

పాలసముద్రం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా గ్రామ సచివాలయాల పరిధిలో నిర్వహించే ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ విద్యావతి తెలిపారు. సోమవారం ఐకేపీ కార్యాలయంలో ఆమె పంచాయతీ కార్యదర్శులు, డ్వాక్రా సంఘ లీడర్లతో సమీక్ష నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్ర టోర్నీలో ఆటగాళ్ల వివరాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ డిసెంబర్ 10వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. 15 ఏళ్లు పైబడిన (పురుషులు–మహిళలు) వారు క్రీడలపై ఆసక్తి ఉంటే వారి పరిధిలోని సచివాలయంలో వివరాలను నమోదు చేసుకోవచ్చని తెలిపారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ పోటీల్లో ఆసక్తి ఉన్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆడుదాం ఆంధ్ర టోర్నమెంట్ ద్వారా గ్రామస్థాయి క్రీడాకారుల్లో ప్రతిభను గుర్తించి, వారిని మండల, జిల్లా నుంచి రాష్ట్రస్థాయికి తీసుకెళ్లడమే ప్రభుత్వం ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం ఫరీదుమస్తాన్, పంచాయతీ కార్యదర్శులు, సంఘమిత్ర, డ్వాక్రా సంఘాల లీడర్లు పాల్గొన్నారు.

రాజ్యాంగంతోనే స్వేచ్ఛ, సమానత్వం

పుత్తూరు: భారతదేశ రాజ్యాంగం పట్ల ప్రతి పౌరుడు అవగాహన కలిగి ఉండాలని స్థానిక ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.శ్రీనివాసులురెడ్డి అన్నారు. సోమవారం కళాశాలలో రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం మేళవించిందే భారత రాజ్యాంగమని అన్నారు. దేశ ప్రజలకు ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో సమానత్వం లభించేలా రాజ్యాంగం రూపొందించబడిందని తెలిపారు. ప్రాథమిక హక్కులు ప్రజలకు రక్షణ కవచంగా ఉన్నాయన్నారు. మానవ హక్కులకు భంగం కలిగినప్పుడు దేశ అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించవచ్చని తెలిపారు. అనంతరం విద్యార్థులచే భారత రాజ్యాంగ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ వీరయ్య, ఎన్ఎస్ఎస్ అధికారులు శ్రీనివాస్, రఘురామన్, అధ్యాపకులు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డి



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

పేదల కోసమే జగనన్న మళ్లీ రావాలి





ఎస్వీఆర్‌పురం గ్రామంలో స్థానికులతో కలిసి వైఎస్సార్‌సీపీ జెండా ఎగుర వేస్తున్న సురేష్‌రాజు, గ్రామస్తులకు భోజనం వడ్డిస్తున్న పార్టీ నాయకులు

- వచ్చే ఎన్నికల్లో ప్రతి నాయకుడు, కార్యకర్త సమష్టిగా పని చేయండి
- వైఎస్సార్‌సీపీ గెలుపే మన లక్ష్యం
- మండల జేసీఎస్ కన్వీనర్ సురేష్‌రాజు

పుత్తూరు: రాష్ట్రంలోని పేద ప్రజల బాగు కోసం మళ్లీ జగనన్నే రావాలని వడమాలపేట మండల జేసీఎస్ కన్వీనర్ ఎం.సురేష్‌రాజు అన్నారు. సోమవారం వడమాలపేట మండలం ఎస్వీఆర్‌పురం సచివాలయ పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. సచివాలయం వద్ద సంక్షేమ లబ్ధి బోర్డును ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలో మహిళలతో కలిసి పార్టీ జెండాను ఎగురవేశారు. ఆయన మాట్లాడుతూ నేడు రాష్ట్ర ప్రజలంతా సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలతో ఎంతో సంతోషంగా ఉన్నారని చెప్పారు. ఈ సంతోషం ఇలాగే కొనసాగాలంటే ఏపీకి జగనన్న మళ్లీ సీఎం కావాల్సిందేనని తెలిపారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి రెండింటిని సమపాళ్లలో అందిస్తున్న జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. నాలుగున్నరేళ్ల కిందట జగనన్న సీఎం కాగానే రాష్ట్రంలో సంక్షేమ సామ్రాజ్యాన్ని స్థాపించారని చెప్పారు. మహిళలకు ప్రాధాన్యత ఇస్తూ, ప్రతి పేద, మధ్య తరగతి కుటుంబాలను సంక్షేమ పథకాలతో ఆదుకుంటున్నారని వివరించారు. ప్రస్తుతం రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమం, అభివృద్ధి నుంచి ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ, ఎల్లో మీడియాను అడ్డు పెట్టుకుని అసత్య ప్రచారాలు చేస్తోందని ఆరోపించారు. దీన్ని తిప్పికొట్టేందుకు పార్టీ శ్రేణులు బాధ్యతగా పనిచేయాలని కోరారు. అదే సమయంలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధి పనులను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. ఇందుకు ప్రతి కార్యకర్త, నాయకుడు తమవంతు పాత్ర పోషించాలన్నారు. అనంతరం గ్రామ ప్రజలతో కలిసి విందు ఆరగించారు. కార్యక్రమంలో శాప్ డైరెక్టర్ యాదవేంద్ర రెడ్డి, మండల కన్వీనర్ సుబ్రమణ్యంరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ సుధీర్‌రెడ్డి, సోషల్ మీడియా కన్వీనర్ చంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకట్రామరాజు, మాధవరాజు, సుదర్శనరాజు, కిరణ్‌కుమార్, బాబు, మునిరాజు, మునిలక్ష్మి, ఉమాపతి, సుధాకర్ రెడ్డి, రాజేంద్ర, రాజేష్, చంద్ర, జయశేఖర్, తిమ్మయ్య పాల్గొన్నారు.